## పశు వైద్య సేవలపై అధికారుల ఆరా

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్ పశు వైద్య ఉపకేంద్రం పరిధిలో వైద్య సేవలపై అధికారులు ఆరా తీశారు. 'సాక్షి' దినపత్రికలో 'మూగ' రోదన..!' అనే శీర్షికన ఈ నెల 14న ప్రచురితమైన కథనానికి పశు వైద్య అధికారులు స్పందించారు. బాధిత రైతుల నుంచి వివరాలను సేకరించారు. ఇక్కడి ఉప కేంద్రంలోని లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌ను కొన్నేళ్ల కిందట శంషాబాద్‌లోని పశువుల ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై బదిలీ చేశారని మండల పశువైద్య అధికారి డాక్టర్ జి.శేఖర్ 'సాక్షి'కి వివరించారు. గత ఏడాది జూలై నెలలో ఉప కేంద్రాన్ని పంచాయతీ పాత భవనంలో ప్రారంభించి అక్కడ వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. రెండు రోజులకే అతను వేరే చోటకు బదిలీ అయినట్లు తెలిపారు. అయినా ఆయా గ్రామాల్లో పశు వైద్య సేవలకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులకు ఎల్లప్పుడు సిబ్బంది అందుబాటులో ఉంటామని, ఫోన్: 81252 13551కు సమాచారం అందిస్తే సిబ్బంది వచ్చి చికిత్స చేస్తారని పేర్కొన్నారు.

## రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి దాదాపు అరగంట పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, ఆరాంఘర్, రాజేంద్రనగర్ రేడియం రోడ్డు, హనుమాన్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసిన వరదనీరు రోడ్లపై నిలిచిపోయి స్థానికులతో పాటు వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వరదనీరు వెళ్లేందుకు సరైన మార్గాలు లేకపోవడంతో ప్రతిసారి ఈ సమస్య తలెత్తుతోంది. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## బీజేపీ రాజేంద్రనగర్ అధ్యక్షుడిగా సందీప్



సందీప్‌ను సన్మానిస్తున్న నేతలు

రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడిగా ఉప్పర్‌పల్లికి చెందిన సందీప్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో పార్టీ స్థానిక నేతలు, కార్యకర్తలు గురువారం సందీప్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సందీప్ ముదిరాజ్ మాట్లాడుతూ... రాజేంద్రనగర్ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ వాటి పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేవారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు... సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన వినోద్ గౌడ్(35) గురువారం ఉదయం పని నిమిత్తం ఆరాంఘర్ ప్రాంతానికి వచ్చాడు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## దోమల నివారణే లక్ష్యంగా పని చేయాలి

గోల్కొండ: దోమల నివారణే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నియోజకవర్గం ఎంటమాలజీ సిబ్బంది గురువారం ఆయనను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దోమల నివారణకు బల్దియా ఎంటమాలజీ ఉన్నతాధికారులు ప్రతిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. బుల్కాపూర్ నాలా, లంగర్‌హౌస్, టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలోని గోల్కొండ కందకాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయన్నారు. లంగర్‌హౌస్ హెచ్‌ఎండీఏ చెరువు, గోల్కొండ నయాకిలాలోని శాతం చెరువులు పూడికతో నిండి దోమలను వృద్ధి చేస్తున్నాయన్నారు. పారిశుద్ధ్య విభాగం, ఎంటమాలజీ విభాగం సమన్వయంతో ముందుకు సాగితే దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు.



హైదర్‌గూడలో గోతుల్లో నిలిచిన వర్షపు నీరు



రహదారిపై నిలిచిన వరద నీరు

# ముందస్తు చర్యలు శూన్యం!

- త్వరలో ప్రారంభం కానున్న వర్షాకాలం
- చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలతో పరేషాన్
- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు

అత్తాపూర్: వేసవి ముగింపు దశలో ఉంది. రుతుపవనాలు నెలాఖరులోనే వచ్చే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ ప్రకటిస్తోంది. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో నెలకొనే ఇబ్బందుల పరిష్కారానికి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది.

- ప్రధానంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నందున వర్షాలకు మురుగుకు తోడు వర్షపు నీరుతోడవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటాయి.
- రోజురోజుకూ పెరిగిపోతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా కనీస వసతులు కల్పించే విషయంలో మాత్రం నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల కాలం నాటి భూగర్భ డ్రైనేజీనే ఉన్నందున సర్కిల్ హైదర్‌గూడ, అత్తాపూర్, దుర్గానగర్, ప్రేమావతీపేట్, శివరాంపల్లి, డైరీ ఫామ్ చౌరస్తా, జనప్రియ తదితర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికి వరద నీరు చేరుతూ జనజీవనం స్తంభించిపోతుంది. పలు చౌరస్తాలు, దుకాణ సముదాయాల వద్ద వరద నీరు నిలుస్తూ వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఈ పరిస్థితులను ముందస్తుగానే గ్రహించి వర్షాలు ప్రారంభం కాకముందు ఆయా సమస్యలను విజయవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకునే విషయంలో జీహెచ్‌ఎంసీ మిన్నకుండిపోతోందంటూ ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గృహ నిర్మాణాలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించనందునే సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయంటున్నారుయి. రాజేంద్రనగర్‌లో భూగర్భ డ్రైనేజీ కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రూ. 120 కోట్ల మేర నిధులను విడుదల చేశారు. ఆ నిధులను ప్రధాన రహదారులను ఆధునికీకరించేందుకు ఖర్చు చేశారు.



వర్షానికి పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

### చిన్నపాటి వర్షానికే...



గంటపాటు చిన్నపాటి వర్షం కురిసినా స్థానికంగా రోడ్లన్నీ పూర్తిగా జలమయం అవుతాయి. వర్షపు నీటికి మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతుంటాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా సమస్యల నివారణకు వర్షాకాలం ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులు చేపట్టాలి. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. – రాచూరి రాజశేఖర్, హైదర్‌గూడ

## జెడ్‌సీకి బీజేపీ నేతల వినతి



జెడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

అత్తాపూర్: వర్షాలకు రోడ్లు జలమయమై ఇళ్లల్లోకి చేరడంతో పాదచారులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎందుర్కొంటున్నారని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని శివాజీనగర్, నందిముస్లాయిగూడ, సాయిబాబాగుడి చౌరస్తా తదితర ప్రాంతాల్లో వర్షాలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గురువారం జోనల్ కమిషనర్‌ను కలిసిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షం పడ్డప్పుడల్లా రోడ్లన్నీ నిండి ఎటు పోనీ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. శివాజీనగర్ దగ్గర వాటర్ వెళ్లడానికి పైపులు చిన్నగా ఉన్నందున ఓపెన్ మ్యాన్‌హోల్స్ సరిగా లేనందున ఈ సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. నందిముస్లాయిగూడ సాయిబాబాగుడి ముందు చౌరస్తా వద్ద కూడా వర్షపు నీటితో మెయిన్ రోడ్డు పూర్తిగా నిండి వాహనాలకు, ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వెంటనే శివాజీనగర్, సాయిబాబాగుడి ముందు నుంచి మూసీ వరకు వర్షపు నీరు లోనికి వెళ్లే విధంగా పెద్ద పైపులైన్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మొండ్ర కొమురయ్య, కౌన్సిల్ సభ్యులు సాబాద విజయ్ కుమార్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్, సీనియర్ నాయకులు పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, ఎస్.బి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద నీటి తరలింపు పనుల పరిశీలన



వర్షపు నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: వర్షానికి రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా నీటి తరలింపు పనులను నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షానికి పేరుకుపోయిన వరద నీటి తొలగింపు పనులను గురువారం ఆయన పరిశీలించారు. 5వ డివిజన్‌లోని భాగ్యనగర్ కాలనీలో పార్క్, 6వ డివిజన్‌లోని సీ–బ్లాక్, సన్‌సిటీలోని మార్కెట్ ఏరియా, 20వ డివిజన్‌లోని కాళీమందిర్ ప్రధాన రహదారిపై నిలిచిన నీటిని శుభ్రం చేయించారు. చెత్తను స్వీపింగ్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు లక్ష్మీనారాయణ, శాంసన్, కృష్ణ, రాము పాల్గొన్నారు.

# కేన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రఘు సతీష్

మణికొండ: ఆహారపు అలవాట్ల వల్లే అనేక రకాల కేన్సర్‌లు వస్తున్నాయని, వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని ముందుచూపుతో వ్యవహరిస్తే వాటిని రాకుండా చూసుకోవచ్చని భారత్ వికాస్ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షుడు డాక్టర్ రఘు సతీష్ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 500 మంది మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు కేన్సర్‌పై అవగాహన సదస్సు, అనీమియా ముక్త్ భారత్ క్యాంప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ వస్తువుల వాడకం పెరగటం, ఆహార పదార్థాల ఉత్పత్తిలో రసాయనకాలు ఎక్కువగా వాడటంతో ఎక్కువ మందికి అనేక రకాల కేన్సర్‌లు వస్తున్నాయన్నారు. వాటి వాడకాన్ని నివారించే ఆరోగ్యాన్నిచ్చే వస్తువులనే ఎక్కువగా వాడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రతి సంవత్సరం కేన్సర్ పరీక్షలను నిర్వహించుకుని వైద్యుల సలహాలను పాటించాలన్నారు. డాక్టర్ గీతానాగశ్రీ, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు బీరప్ప, సిద్దప్ప, రాఘవరెడ్డి, జిజాబాయి బ్రాంచ్ చీఫ్ ప్యాట్రన్ ఎస్‌బీ రాజశేఖర్, సలహాదారుడు ప్రభూజీ, అధ్యక్షుడు పెంటారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.బాలభారతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కోసం ప్రత్యేక ఆస్పత్రి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న వీసీ

ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయంలో ప్రత్యేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్న వైద్యులు పరిష్కరిస్తారని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి వెల్లడించారు. గురువారం విశ్వవిద్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు వైద్య సేవలు అందించేందుకు రోజూ డాక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు విశ్వవిద్యాలయం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా ప్రతి ఒక్కరం మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భగవాన్, డీన్ చినా నాయక్, అసోసియెట్ డీన్ ప్రశాంత్, మోజర్ల ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ సైదయ్య, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## శంషాబాద్ ఫ్లైఓవర్ కింద మహిళల న్యూసెన్స్

వరసగా అరెస్ట్ చేస్తున్న ఆర్‌జీఐఏ పోలీసులు

శంషాబాద్: కొన్ని రోజులుగా శంషాబాద్ పట్టణంలోని ఫ్లైఓవర్ కింద కొందరు మహిళలు చేస్తున్న న్యూసెన్స్‌పై స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గడచిన మూడు రోజులుగా పోలీసులు వారిని అరెస్ట్ చేస్తున్నారు. వివరాలివీ... పట్టణంలోని జాతీయ రహదారి అనుకుని బస్టాప్ సమీపంలో ఉన్న వైన్స్ వద్ద మద్యం సేవించి వస్తున్న వ్యక్తులను దానికి ఎదురుగానే ఉన్న ఫ్లైఓవర్ కింద గ్రూపులుగా కూర్చుంటున్న మహిళలు ఆకర్షించి దగ్గరికి రప్పించుకుంటున్నారు. కొందరు వ్యభిచారం నిర్వహిస్తుండటంతో పాటు మరికొందరు ఫోన్లు, డబ్బులు గుంజుకుంటూ నానా రభస చేస్తున్నారు. నడిరోడ్డుపై అసభ్య ప్రవర్తనతో న్యూసెన్స్ చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన ఆర్‌జీఐఏ పోలీసులు మూడు రోజుల్లో సుమారు పది మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. కొందరికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపగా ముగ్గురు మహిళలపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## నాలాల్లో చెత్త వేయొద్దు

మణికొండ: నాలాల్లో చెత్తాచెదారం వేయటంతో అవి నీటి ప్రవాహానికి అడ్డుగా రావటంతో పాటు దుర్గంధానికి కారణం అవుతున్నాయని వాటిని వేయవద్దని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్, పందెన్‌వాగు నాలాల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించే పనులను గురువారం ప్రారంభించారు. ఇటీవల ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు కలిసి మున్సిపల్ కమిషనర్‌ను కలిసి నాలాల పరిస్థితి వివరించారు. దాంతో స్పందించిన ఆయన గురువారం నుంచి వాటిని క్లీన్ చేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... రాబోయే వర్షాకాలంలో పైనున్న ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుందన్నారు. దాన్ని సాఫీగా మూసీనదిలో కలిసేలా నాలాలను సిద్ధం చేస్తున్నామన్నారు. అనేక చోట్ల నాలాల్లో చెత్త వేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని, అయినా కొందరు వాటిల్లో చెత్త వేసి పర్యావరణాన్ని దెబ్బ తీస్తున్నారన్నారు. చెత్తను వేసే స్థలాలను గుర్తించి అలాంటి వారిని గుర్తించి తగు చర్యలు, జరిమానాలు విధిస్తామన్నారు. నాలాల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టడంతో ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ కృతజ్ఞతలు తెలిపారు.

## కుటుంబ కలహాలతో వలస కార్మికుడి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్: కుటుంబ కలహాల కారణంగా మనోవేదనకు గురై వలస కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని సుల్తాన్‌పల్లిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ఒడిశా రాష్ట్రం బాలన్‌గిర్ జిల్లా కుహనౌన్స గ్రామానికి చెందిన భీం మజీహి (36) కుటుంబ సభ్యులతో కలిసి ఐదేళ్ల కిందట వలస వచ్చి సుల్తాన్‌పల్లిలో ఇటుక బట్టీల్లో పని చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. ఈ నెల 14న సాయంత్రం భీం తన తల్లి మియిల్లాతో కుటుంబ విషయాలపై గొడవపడ్డాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున భీం గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఒకదానికొకటి ఢీకొన్న కార్లు

ఇద్దరికి స్వల్ప గాయాలు

రాజేంద్రనగర్: పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్ వే పై రెండు కార్లు ఢీ కొనడంతో ఇద్దరు స్వల్ప గాయాలకు గురయ్యారు. ఈ సంఘటనతో ఎక్స్‌ప్రెస్ వేపై అర గంట పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పిల్లర్ నంబర్ 274 వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని వెంటనే వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో రెండు కార్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఇరువురికి స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి పీహెచ్‌సీలో సి–వై టీబీ' పరీక్షలు



సి–వై టీబీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ పాపారావు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సి–వై టీబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ పాపారావు, డాక్టర్ చేతస్ చంద్రకళ, కోఆర్డినేటగర్ రోజారాణి, టీబీ సూపర్ వైజర్ నరేష్‌కుమార్, రహీంలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాపారావు మాట్లాడుతూ... జిల్లాలో టీబీ వ్యాధి ఉందా లేదా అనేది ముందస్తుగానే గుర్తించేందుకు సి–వై టీబీ లాంటి కొత్త సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా రాజేంద్రనగర్ టీబీ యూనిట్‌గా ఈ సేవలు ప్రారంభించడం ద్వారా ప్రజలకు మరింత ముందుగానే చికిత్స అందించవచ్చన్నారు. టీబీ మందులు వాడినవారు, డయాబెటిస్ ఉన్నవారు, బీడీ, సిగరెట్లు తాగే వారు అధిక ప్రమాదానికి గురైన వారు సి–వై టీబీ ద్వారా టెస్ట్ చేయించుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

మణికొండ: కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై ఓ మూగజీవి ప్రాణం కోల్పోయింది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో రైతు గడిల నర్సింగ్‌కు చెందిన గేదె గురువారం పొలంలో గడ్డిమేస్తూ విద్యుత్ వైర్లకు తగిలి మృతి చెందింది. పలుమార్లు విద్యుత్ వైర్లను సరిచేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని ఆయన వాపోయారు. ఇకనైనా విద్యుత్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, తన గేదె మృతి చెందినందున తనకు రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇదే తరహాలో విద్యుత్ వైర్లకు కిందకు గ్రామంలో పలు చోట్ల ఉన్నాయని వాటిని వెంటనే సరిచేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## అన్నం వండుతున్న పాత్రపై పడి.. గాయపడ్డ వృద్ధుడి మృతి



గౌతం అంజయ్య (ఫైల్)

శంషాబాద్ రూరల్: పొయ్యి మీద అన్నం వండుతున్న పాత్రపై ప్రమాదవశాత్తు పడిన వృద్ధుడు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల పరిధిలోని చిన్నగోల్కొండలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... గ్రామానికి చెందిన గౌతం అంజయ్య(78) గత నెల 30న ఇంట్లో నడుచుకుంటూ ప్రమాదవశాత్తు అన్నం వండుతున్న పాత్రపై పడి పోయాడు. ఈ ఘటనలో అతనికి గాయాలవగా.. చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కేబుల్ వైర్లతో ఇబ్బందులు





బండ్లగూడలో ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లు

శాస్త్రిపురం: విద్యుత్ స్తంభాలు ప్రైవేట్ కేబుళ్లకు నిలయంగా మారాయి. సంబంధితే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యుత్ స్తంభాలకు వివిధ కేబుల్ వైర్లను చుట్టలుగా చుట్టి స్తంభాలకు కడుతున్నారు. విద్యుత్ తీగల కోసం ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు ప్రైవేట్ కేబుళ్ల వారికి పలు రకాలుగా ఉపయోగపడుతున్నాయి. టెలిఫోన్, ఇంటర్నెట్, వివిధ చానళ్ల కేబుల్ వైర్లను ఆయా నిర్వాహకులు విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు ఇలా గుత్తులుగా విద్యుత్ తీగలు అల్లుకొని ఉంటుండడంతో విద్యుత్ స్తంభాలన్నీ పిచ్చుక గూళ్లను తలపిస్తున్నాయి. కేబుల్ వైర్లను ఇష్టానుసారంగా స్తంభాలకు అమర్చుతుండటం మరమ్మతుల కోసం తరుచూ స్తంభాలపైకి కేబుళ్ల నిర్వాహకులు ఎక్కుతుండటంతో విద్యుత్ దీపాలకు అమర్చిన విద్యుత్ వైర్లు ఊడిపోతున్నాయి. ఫలితంగా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. ఇంతే కాకుండా విద్యుత్ ప్రసారాల్లో తరుచూ అంతరాయం ఏర్పడుతుంది. శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, డివిజన్‌లోని పలు బస్తీలలో కేబుల్ వైర్ల కారణంగా ఇబ్బందులు ఎదరువుతన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### బండ్లగూడ జాగీర్ పరిధిలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో కేబుల్, టీవీ వైర్లు ప్రాణాంతకరంగా మారాయని కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.ఎస్.గోపాలాచారి, కార్యదర్శి విశ్వనాథ సురేందర్ ఆరోపించారు. రోడ్ల పొడవునా ఎక్కడ చూసినా ఇంటర్నెట్ కేబుల్ వైర్లు పడిపోయి పాదచారులకు, వాహనాదారులకు గొంతుకు, కాళ్లకు చుట్టుకొని రోడ్లపై పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఆక్ట్ ఫైబర్ కేబుల్స్, జియో కేబుల్స్ రకరకాల కేబుల్ వైర్లు పడి ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ కేబుల్ వాళ్లను అడిగితే ఈ కేబుల్ మాది కాదు అని బుకాయించి చెబుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ఇంటర్నెట్ వైర్లని ఒక సింగల్ కేబుల్‌గా మార్చిప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలన్నారు.



చింతల్‌మెట్ బస్తీలో విద్యుత్ స్తంభాలకు చుట్టిన కేబుల్స్